# జన్యు ప్రేరేపణ అంటే?

మనిషి లేదా జంతువు లేదా క్రిమి సమస్త జీవరాశి యొక్క మానసిక, శారీరక ప్రేరేపణ అంతా వారి వారి దేహనిర్మాణంలో యిమిడి ఉన్న జన్యుకణాల వలననే జరుగుచున్నది. ఆలోచనాపద్ధతి శారీరక ప్రేరేపణలు అన్నీ పూర్తిగా జన్యు లక్షణాలపైనే ఆధారపడి జరుగుచున్నది. ఈ జన్యువులు నవగ్రహాల ప్రేరేపణతో నిర్మితమై జీవనం కొనసాగిస్తున్నవి. ఈ నవగ్రహాలు ఆయా వ్యక్తుల గత కర్మ శేష ఫలితాలను అమలు చేస్తున్నవి. కనుకనే మనిషి చేసిన పాప, పుణ్యాలు ఏడు తరాలుండునని ఋషీశ్వరులు ఉవాచ.

ఈ జన్యువు అంటే మనిషి దేహంలోని ఒక నిర్మాణం. ఈ కణ నిర్మాణాన్ని ఛేదిస్తే 23 జతల క్రోమోజోములు. కనుకనే ఒక వంశంలోని వారి లక్షణాలు ఒకే విధంగా ఉంటుంటాయి. మంచి వంశ లక్షణాలు, చెడ్డ వంశ లక్షణాలు అనేవి ఈ క్రోమోజోముల వలనే రూపు దిద్దుకొంటున్నవి.

ఒక మంచి వంశంలో జన్మించినవారిలో 90% అందరూ మంచి గుణాలనే సంతరించుకొంటున్నారు. ఒక చెడ్డ, దుర్మార్గ వంశాలలో జన్మించిన వారిలో 90% అంతా దుర్మార్గ ప్రవర్తనని సంతరించుకొంటున్నారు. సంఘంలో జరిగే హత్యలు, కొట్లాటలు సమస్తం ఈ జన్యు ప్రేరేపణవలనే జరుగును.

మనిషి దేహంలోని అనారోగ్యం కూడా ఈ జన్యు సంబంధంగానే ఏర్పడుచున్నది. దీనిని విశదీకరించే శాస్త్రం జన్యుశాస్త్రం. ఈ హ్యుమెన్ జెనిటిక్ అనే శాస్త్రంలో ఈనాడు అద్భుత పరిశోధనలు జరుగుచున్నవి.

దుష్టకర్మ యొక్క ఫలితాలన్ని పొందాల్సిన మనిషి చెడు లాభాన్ని పొందే మార్గంలో అతని ఆలోచనావిధానం ఏర్పడుతుంది. అలా ఏర్పడకపోతే అతను తన పాప కర్మని అనుభవించలేడు. కర్మ సిద్ధాంతం నిర్వీర్యం అవుతుంది. మనిషి కర్మని నియంత్రించి నిర్ధేశించేది నవగ్రహాలు. వీటి శక్తిని పొందిన పంచభూతాలు మాతృగర్భంలో శిశువు దేహం నిర్మాణంలోని జన్యువుని రూపొందించి అదే శైలిలో వ్యవహరించేట్లు చేస్తున్నవి. మనిషి కర్మ నియంత్రణ మనిషి దేహంలోని జన్యు నిర్మాణంలోనే ప్రారంభమగుచున్నది. ఈ భూమిపై మనిషి పొందే సమస్త సుఖదుఃఖాలన్నీ అతని కర్మ ఫలితాలే.

కనుకనే వివాహాది విషయాలలో వంశ గౌరవ లక్షణాలు అత్యంత ముఖ్యం. బ్రతికి చెడినవారితో మనం మాట్లాడగలం కాని చెడి బ్రతికి, అర్థాంతరంగా సిరి పొందినవారితో మనం మాట్లాడలేము.

లోహ లక్షణములు ఎంత గొప్పవో జన్మలక్షణాలు కూడా అంతే గొప్పవి. జీవిత భాగస్వామి వలన దుష్టకర్మని, నరకాన్ని మానసిక క్లేశం అనుభవించవల్సిన ఒక వ్యక్తి దుర్మార్గ వంశ లక్షణాలు కల్గిన వంశంలోని వారిని జీవిత భాగస్వామిగా చేసుకోవడం జరుగును. తద్వారా ఆ జీవిత భాగస్వామి చేష్టలకు, మాటలకు ఈ భాగస్వామి నరకాన్ని, తద్వారా తను అనుభవించాల్సిన కర్మశేషాన్ని అనుభవించడం జరుగును. ఎవరి కర్మని వారుపూర్తిగా పొందుదురు. కర్మతోనే పుట్టుక, జీవనం, మరణం. ఎవరూ దీనికి అతీతులు కారు. దీనిని తప్పించుకోలేరు. ఆలోచన, ప్రేరేపణకు మూలం నవగ్రహాలే.

**పి. గిరిరాజు సిద్ధాంతి**

Click here to get your free novaPDF Lite registration key